క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం

చిట్టమూరు: మండల పరిధిలోని తంబుగారిపాళెంలో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్ల విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ చేసి, కల్యాణ రాయబారం నిర్వహించి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు.

ఎమ్మెల్సీ మేరిగకు పరామర్శ



మేరిగ మురళీధర్‌ను పరామర్శిస్తున్న కొడవలూరు ధనుంజయరెడ్డి

కోట: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొడవలూరు ధనుంజయరెడ్డి పరామర్శించారు. మేరిగ మురళీధర్ తండ్రి ఆనందరావు మృతి చెందిన విషయం తెలిసిందే. మండల నాయకులతో కలసి రాపూరులోని వారి స్వగృహంలో ఆనందరావు చిత్రపటానికి నివాళులర్పించారు. మేరిగ మురళీధర్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి చేయూత



భవనం ప్రారంభిస్తున్న దాతలు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు చేయూత అందిస్తున్నట్లు హిందూ ధర్మ సేవా సంఘం కన్వీనర్ కామిరెడ్డి రాజా రెడ్డి సోమవారం తెలిపారు. సోల్లేటి ప్రవీణ జ్ఞాపకార్థంగా ఆమె భర్త సోల్లేటి శ్రీనివాసులు అందించిన రూ.4లక్షలతో పాటు సంఘం నిధులు కలిపి సుమారు రూ.5 లక్షలకు పైగా ఖర్చు పెట్టి శ్మశాన వాటిక వాహనాల డ్రైవర్‌కు పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఈ గృహాన్ని సోమవారం రాజారెడ్డి, సంఘ నాయకులతో కలిసి ప్రారంభించారు.

దేవాలయాల్లో సీసీ కెమెరాలు

కలువాయి(సైదాపురం): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ కోట్యయ తెలిపారు. సోమవారం కలువాయి పోలీసుస్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతుంటే వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

చికెన్ ధరలు 19-8-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	123
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	224
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	250
లేయర్ చికెన్	:	200

కూటమి దారు(ణా)లు

బురదగుంటగా మారిన దొరవారిసత్రం-వేణుంబాకం రోడ్డు



అధ్వాన్నంగా ఉన్న తడమండలం అండగుండాలకు వెళ్లే రోడ్డు





నాయుడుపేట సబ్ ట్రెజరరీ కార్యాలయం రోడ్డు దుస్థితి



దొరవారిసత్రం: కల్లూరులో అంతర్గత రోడ్డు దుస్థితి

సూళ్లూరుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను సుందరంగా తీర్చిదిద్దుతామని వాగ్దానాలు కుమ్మరించారు. ఏడాది దాటినా కూడా ఇప్పటివరకు పల్లెలోకి వెళ్లే రహదారులను కనీసం పట్టించుకోలేదు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్యాచ్ వర్కుల పేరుతో తెలుగు తమ్ముళ్ల జేబులు నింపుకోవడం తప్ప ఇక్కడ ఒరిగిందేమీ లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే లింక్ రోడ్లు బురదగుంటలుగా తయారయ్యాయి. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణాలు నరకంగా మారాయి. ప్యాచ్ వర్కుల పేరుతో రూ.4 కోట్లు ఖర్చు చేసి కంకర సిమెంట్ కలిపి గుంతలకు వేశారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు లేచిపోయి గుంతలేర్పడ్డాయి. ప్యాచ్ వర్కులకు కేటాయించిన రూ.4 కోట్లు ప్రభుత్వ ధనం బూడిదలో పోసిన పన్నీరైంది.



చిల్లకూరు: వరగలి - మోమిడి గ్రామాల మధ్య రోడ్డుపై ఉన్న గుంత

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

గూడూరు రూరల్: గూడూరు పట్టణ పరిధిలోని విందూరు రోడ్డు మార్గంలో సోమవారం సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కథనం మేరకు వేములపాళెం గ్రామానికి చెందిన శివయ్య సైకిల్‌పై పట్టణంలోని నిమ్మ మార్కెట్ వద్దకు వెళుతుండగా వెనుక వైపు నుంచి ఓ ప్రైవేట్ బస్సు అదుపు తప్పి ఢీకొంది. దీంతో శివయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నక్కల కాలువ భూములు పేదలకు పంచాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, రైతులు

చిల్లకూరు: మండలంలోని నెలబల్లి రెట్టపల్లి సమీపంలో ఉన్న నక్కల కాలువ కండ్రిగలోని భూములను పేదలకు పంచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం గ్రామానికి చెందిన పేదలతో కలిసి సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న నక్కల కాలువ కండ్రిగలోని భూములను గతంలో ఏపీఐఐసీకి అప్పగించారని అన్నారు. అయితే వారు స్వాధీనం చేసుకోక పోవడంతో పేదలు ఇప్పటికీ సాగు చేసుకుంటూనే ఉన్నారని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అధికార పార్టీకి చెందిన నాయకులు నేడు భూముల్లోకి దిగి తమకు అనుకూలంగా ఉండే వారితో భూములు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. గత వారం భూముల వద్దకు పేదలు సాగు చేసుకునేందుకు వెళితే అధికార పార్టీ నాయకులు అడ్డుకున్నట్లు చెప్పారు. దీనిపై సమగ్రంగా విచారణ చేసి గ్రామంలోని 200 కుటుంబాల వారికి కనీసం పది సెంట్లు భూమి వచ్చేలా పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్, నాయకులు శశికుమార్, సీవీఆర్‌కుమార్, సీపీఎం నాయకులు గోపాల్ పాల్గొన్నారు.

వాహన డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న గూడూరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్

వాకాడు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లేకుంటే వాహనాలను సీజ్ చేయనున్నట్లు గూడూరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ హెచ్చరించారు. గూడూరు ఆర్టీఓ కార్యాలయ అధికారులు సోమవారం కోట, వాకాడు మండలాల్లో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 16 వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేసి రూ.85 వేలు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ వాహనాలను బాడుగకు ఉపయోగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోయినా, త్రిబుల్ రైడర్ చేసినా వాహనాలు సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇకపై తరచూ వాహనాల తనిఖీలు నిర్వహించి అనుమతులు లేని వాహనాలపై కేసులు నమోదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈయనతోపాటు మహిళా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శాంతి, సిబ్బంది ఉన్నారు.

నూతన వధూవరులకు కిలివేటి ఆశీస్సులు



నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

నాయుడుపేటటౌన్: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త రాజేష్ వివాహ వేడుకకు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు. పట్టణంలోని కే కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులకు కిలివేటి ఆశీర్వాదాలు అందించారు.

గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటగిరి రూరల్/గూడూరురూరల్ : వెంకటగిరి మండలంలోని జీకేపల్లి , గూడూరు మండలం చెన్నూరు పీహెచ్‌సీల్లో సోమవారం స్విమ్స్ పింక్ బస్సు ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతంగా జరుగుతున్నాయని స్విమ్స్ నోడల్ అధికారిణి డాక్టర్ టి.వి.డి. ప్రత్యూష తెలిపారు. నోటిక్యాన్సర్, రొమ్ముక్యాన్సర్ నిర్ధారణకు మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈనెల 21న గూడూరు మండలంలోని బాలాయపల్లి, డక్కిలి, 25న చిట్టేడు, చిల్లకూరు, 28న దాసుకుప్పం, బంగారుపేటలో పింక్ బస్సుల సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

కండలేరులో 28.59 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 28.59 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 7160 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1740, పిన్నేరుకాలువకు 30, లోలెవల్ కాలువకు 40, మొదటిబ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

లీకేజీతో తాగునీరు కలుషితం



రహదారిపై తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయి లీకవుతున్న నీరు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పాత ట్రెజరీ వీధి సమీపంలో ప్రధాన రహదారి వద్ద తాగునీటి పైప్‌లైన్‌లు పగిలిపోవడంతో మురుగునీరు కలిసిపోతోందని స్థానికులు వాపోతున్నారు. పట్టణ పరిధిలోని ఆర్‌అండ్‌బీకి సంబంధించిన ప్రధాన రహదారి వద్ద గుంతలమయంగా ఉంది. ఈ రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. రోడ్డు చాలా వరకు ధ్వంసమైంది. దీంతో తాగునీటి పైప్‌లైన్‌లు పగిలిపోయాయి. అందులో మురుగు కలిసిపోయి కుళాయిల్లో కలుషితనీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై కమిషనర్ షేక్ ఫజులుల్లా వివరణ కోరగా భారీ వాహనాల రాకపోకల కారణంగా పైప్‌లైన్లు పగిలినట్లు గుర్తించామన్నారు. మంగళవారం యుద్ధ ప్రాతిపదికన సిబ్బందితో మరమ్మతు పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని క్రాస్‌రోడ్డు వద్ద స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సొంత నిధులతో నిర్మించిన పోలేరమ్మ తల్లి ఆలయ ముఖద్వారాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సతీమణి సింధు పాల్గొని ప్రారంభించారు. తొలుత పోలేరమ్మ తల్లి ఆలయంవద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్రాస్‌రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన ఆర్చిని ప్రారంభించారు.

గురుకులంలో తహసీల్దార్ విచారణ

కోట: స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం తహసీల్దార్ జయజయరావు విచారణ జరిపారు. గురుకులంలో విద్యార్థుల చేత వంట పనులు చేయిస్తున్నారన్న ఫిర్యాదుపై సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రిన్సిపల్ నారాయణరావు నుంచి వివరణ తీసుకున్నారు. ఇష్ట పూర్వకంగానే ఆదివారం కొందరు విద్యార్థులు పూరీలు చేసే పనికి సహకరించినట్లు తెలిపారన్నారు. ఆయనతోపాటు ఎంఈఓ మస్తానయ్య పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీ పోలేరమ్మతల్లి ఆలయం హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయన ఈఓ అరవభూమి వెంకట శ్రీనివాసులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి హుండీ నగదు (పరకామణి) సేవలో పట్టణ ప్రజలు పాల్గొనదలచుకుంటే పంచె కండువా ధరించి పాల్గొనాలని సూచించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

గూడూరురూరల్ : చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం తీసుకున్న భూ ములకు సంబంధించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సోమ వారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కోట మండలం గున్నంపడియ గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాది అమృత్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా సాగు చేసుకుంటున్న భూములు తీసుకుని పరిహారం ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి జీవనాధారం కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ ఏఓ శిరీషకు వినతిపత్రం అందజేశారు.

కనుల పండువగా శోభాయాత్ర



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

చిల్లకూరు : శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గూడూరు పట్టణంలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. గూడూరు పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్ నుంచి ఆరంభమైన యాత్ర పట్టణంలోని రైల్వే స్టేషన్, టవర్ క్లాక్ సెంటర్, బజారు వీధి, గాంధీబొమ్మ సెంటర్, సగం థియేటర్, ఆస్పత్రి రోడ్డు మీదుగా డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌కు చేరుకుంది. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఓజిలి: మండలంలోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ శైలజ పేర్కొన్నారు. మండల వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర వలంటీర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 2450 మంది నిరక్షరాస్యులను గుర్తించామని వీరికి రాత్రి బడులు నిర్వహించి అక్షరాస్యులుగా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏపీఎం పద్మమ్మ పాల్గొన్నారు.